RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 34 | పేజీలు : 4 | బుధవారం 5 ఆగస్టు 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## విశాఖ రూపురేఖలు మార్చే
# మాస్టర్ ప్లాన్

### సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
### విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష

**రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం**

**ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు**

**మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి**

**ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి**

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమీక్షా సమావేశంలో వీఈఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. 'బేసిటీ' ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా చేసుకుని విశాఖ రీజియన్ అభివృద్ధిని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. వీఈఆర్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ స్థాయి ప్రణాళికతో సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళిక మూలపేట పోర్టు నుంచి రాజమండ్రిలోని అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు విస్తరించి ఉండాలని ఆయన సూచించారు. ఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (ఎ+ఖీ) స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఫ్రాన్స్‌లో కార్చిచ్చు
# బీభత్సం

- బయటపడిన రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబుల గుట్ట!
- లీ పోర్జ్ గ్రామంలో సుమారు 400 పాతకాలపు బాంబుల గుర్తింపు
- మంటల వేడికి పేలుతున్న బాంబులతో యుద్ధ వాతావరణం
- భారీ నష్టం.. 180 ఇళ్లను ధ్వంసం చేసిన 10 రోజుల కార్చిచ్చు
- అధికారులు బాంబుల నిర్వీర్య పనులు చేపట్టడంతో పలు ప్రాంతాల్లో ఆంక్షలు



## దిగొచ్చిన మెటా.. భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

- భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పిన మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్
- డీప్‌ఫేక్‌లు, అభ్యంతరకర కంటెంట్ వ్యాప్తిపై చింతిస్తున్నట్లు వెల్లడి
- ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపు వ్యవహారంలో కీలక పరిణామం

# రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు



- కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు
- దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్
- కూటమి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తీవ్ర ఆరోపణలు
- పొగాకుకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన
- వైసీపీ హయాంలో ఉన్న సున్నావడ్డీ, రైతు భరోసా పథకాలు రద్దు చేశారని విమర్శ
- ప్రభుత్వం సిండికేట్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తోందని జగన్ ధ్వజం

## కీలక ప్రాజెక్టులకు పర్యావరణ
# క్లియరెన్స్ ఇవ్వాలి

**కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో రేవంత్ రెడ్డి భేటీ**

**ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్న రేవంత్ రెడ్డి**

**కేంద్ర మంత్రులతో వరుస సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలతో భేటీ**

**పలు కీలక ప్రాజెక్టులకు తక్షణమే అటవీ, పర్యావరణ క్లియరెన్స్ ఇచ్చి నిధులు మంజూరు చేయాలని వినతి**



**హైదారాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన రాజకీయంగా, అభివృద్ధి పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఉదయం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు కీలక ప్రాజెక్టులకు తక్షణమే అటవీ, పర్యావరణ క్లియరెన్స్ ఇచ్చి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్న ఈ సమావేశం అనంతరం, సీఎం జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నారు. గోదావరి-కృష్ణా నదీ జలాల పంపిణీ, ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న జల వివాదాలు, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించనున్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలతో భేటీ కానున్నట్లు సమాచారం. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మంత్రివర్గ కూర్పును విజయవంతంగా కొలిక్కి తెచ్చిన హైకమాండ్, ఇప్పుడు తెలంగాణలో కూడా - మిగతా3లో

## ఇకపై ఎరువుల బుకింగ్‌కు
# బయోమెట్రిక్?!

**విజిలెన్స్ తనిఖీల్లో బయటపడ్డ అక్రమాలు**

**ఎరువుల యాప్ వినియోగంపై పరిశీలనలు**

**రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు**

**రూ. 1.34 కోట్ల విలువైన ఎరువుల్ని దారి మళ్లించినట్లు గుర్తింపు**




**హైదరాబాద్**

పంటల దిగుబడికి ఎరువుల అవసరం రైతన్నలకు ఎంతో ఉంటుంది. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎరువుల కొరత లేకుండా చూసుకుంటుంది. ఈ ఏడాది ఖరీఫ్? సాగు కీలకదశకు చేరుకుంటున్నందున ఎరువుల కొరతపై ప్రభుత్వం అధ్యయనం చేసింది. విజిలెన్స్?, ఎన్?ఫోర్స్?మెంట్? బృందాలు కొద్దిరోజుల క్రితం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. రైతులకు ఎరువుల కోసం ఓ యాప్?ను రూపొందించారు. - మిగతా3లో



## తెలంగాణలో సాగు, తాగునీటిని దూరం చేసేందుకు కుట్ర

### బీఆర్ఎస్ ముఖ్య నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్**

తెలంగాణ సాగు, తాగునీటి ప్రయోజనాలను పణంగా పెట్టేలా ఏపీ ప్రభుత్వం కుట్ర చేస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ ముఖ్య నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈనెల 18న జరగనున్న గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) ఏపీ ప్రయోజనాల కోసం జరుగుతున్నట్లు ఉందని ఆరోపించారు. తెలంగాణకు చెందిన 7 ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని ఆ రాష్ట్రం ప్రతిపాదించిందన్నారు. అజెండా ఖరారై వారం రోజులైనా తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు.

## శ్రీశైలం నుంచి రాయలసీమకు నీటి విడుదల..

**ప్రాధాన్యత తాగునీటికేనన్న మంత్రి నిమ్మల**

**శ్రీశైలం జలాశయంలో 119 టీఎంసీల నీరు ఉందన్న నిమ్మల**

**రాబోయే 10 రోజుల్లో మరో 100 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉందని వెల్లడి**



**అమరావతి**

రాయలసీమ ప్రాంత తాగునీటి అవసరాలను తీర్చేందుకు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను అధిగమించేందుకు రాబోయే 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను ప్రధానంగా తాగునీటి అవసరాలకే భద్రపరచాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం శ్రీశైలంలో 119 టీఎంసీల నీరు నిల్వ ఉందని, రాబోయే పది రోజుల్లో మరో 100 టీఎంసీల మేర వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

బుధవారం 5 ఆగస్టు 2026
సీమ వార్త
సాయంకాలం
అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

# అనంత జిల్లా...ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కొత్త కమిటీ ఏర్పాటు

......జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సభ్యులు.

.... అనంత జిల్లా చైర్మన్ గా గజ్జల లక్ష్మి ప్రసాద్ ఎన్నిక.

.... ట్రెజరర్ గా సుంకర రమేష్ ఏకగ్రీవ ఎన్నిక.





**అనంతపురము, ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం.**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురము జిల్లా శాఖ పాలకసమితి పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో, నూతన కార్యవర్గ ఎన్నికలు మరియు వార్షిక సర్వసభ్య సమావేశం ఈ ఏడాది ఏప్రిల్ 29న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎన్నికల అధికారి జి. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది. నూతన కార్యవర్గంలో సభ్యులుగా ఎన్నిక కావడానికి నాలుగు ప్యానెల్‌ల నుంచి మొత్తం 44 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సేవా సంస్థ అయిన రెడ్ క్రాస్‌లో సేవాభావానికే ప్రాధాన్యం ఉండాలని, ఎన్నికలు వివాదాలకు దారితీయకుండా ఏకాభిప్రాయంతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్ క్రాస్ శాఖతో పాటు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఓ. ఆనంద్, ఐ.ఏ.ఎస్. గారు సూచించారు. ఈ మేరకు అన్ని ప్యానెల్‌ల ప్రతినిధులతో రెండు దఫాలుగా సమావేశాలు నిర్వహించి, పరస్పర అవగాహనతో 11 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. అనంతరం సభ్యులలో ముగ్గురిని చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్‌లుగా ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, అధికారికంగా ధృవీకరించారు నూతన కార్యవర్గంలో డా. గజ్జల లక్ష్మణ ప్రసాద్ చైర్మన్‌గా, ప్రొఫెసర్ డా. గీతా బాల వైస్ చైర్మన్‌గా, సుంకర రమేష్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా డా. కె. లక్ష్మీనారాయణ, ఎం.జి. ఎరన్న, డా. ఓ. మనోరంజన్ రెడ్డి, ఆలంబన జనార్ధన్, భిసతి భరత్, దాసరి భరత్ కుమార్, వి.కె. శ్రీవాణి మరియు విష్ణుప్రియ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఓ. ఆనంద్, ఐ.ఏ.ఎస్. గారిని వారి ఛాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ, వైద్య, విద్య, వ్యాపార, సామాజిక సేవ తదితర విభిన్న రంగాలకు చెందిన అనుభవజ్ఞులు ఒకే వేదికపై కలసి సమర్థవంతమైన కార్యవర్గంగా ఏర్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. సభ్యులందరూ సమిష్టి భావంతో పనిచేస్తూ రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. అదేవిధంగా, ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న "చేయూత" ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచిస్తూ, వీలు చూసుకుని త్వరలోనే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురము జిల్లా శాఖ కార్యాలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, జిల్లా పరిపాలన అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, రక్తదానం, ప్రథమ చికిత్స శిక్షణ, విపత్తు నిర్వహణ, ఆరోగ్య సేవలు, యువజన సేవా కార్యక్రమాలు, దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమాలు మరియు ఇతర మానవతా సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేసేందుకు సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.





# నవోదయ.... నవతరానికి పునాది..!!

.....జవహర్ నవోదయ విద్యాలయంలో అంగరంగ వైభవంగా 'నవోదయ ఫౌండేషన్ డే' వేడుకలు

.....ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

.....పది, పన్నెండో తరగతుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం

....ఆకట్టుకున్న యోగా డాన్స్, క్లాసికల్ నృత్య ప్రదర్శనలు

**లేపాక్షి ఆగస్టు 5: సీమ వార్త సాయంత్రం.**

లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం 'నవోదయ ఫౌండేషన్ డే' వేడుకలు అత్యంత వేడుకగా, అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఉదయం 11:00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలకు విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు అధ్యక్షత వహించారు.కార్యక్రమం ప్రారంభంలో ప్రిన్సిపాల్ నాగరాజు స్వాగతోపన్యాసం చేస్తూ, నవోదయ విద్యాలయాల ఆవిర్భావం మరియు ఫౌండేషన్ డే ప్రాముఖ్యతను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో నవోదయ సంస్థలు పోషిస్తున్న పాత్రను ఆయన కొనియాడారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు గాజ, ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాధించిన ప్రతిభను - మిగతా3లో




# ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు వద్దు..!!

నీటి సంరక్షణకై....ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఇంకుడు గుంతలు తప్పనిసరి

.....లేపాక్షిలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన... తహసీల్దార్ కార్యాలయంలో ఇంకుడు గుంత నిర్మాణానికి భూమి పూజ

లేపాక్షి తహసీల్దార్‌కు జిల్లా కలెక్టర్ అభినందనలు.. తహసీల్దార్ కార్యాలయ పరిశుభ్రత, మెరుగైన రికార్డుల నిర్వహణపై ప్రశంసలు

కార్యాలయ రికార్డులు, బి ఎల్ ఓ, బి ఎల్ ఏ సమావేశాల పరిశీలన.. జిల్లా పర్యటన లో...జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్




# సీమలో బలమైన శక్తిగా... బలిజలు ఎదగాలి..!

కడపలో కార్తీక వనభోజనాల ఏర్పాట్లపై సమీక్ష.

పాల్గొన్న.... కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణస్వామి రాయల్.

**కడప ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం.**

కడప లో రాష్ట్ర కాపునాడు ప్రధాన కార్యదర్శి సెగినేని పోతులూరయ్య ఆధ్వర్యంలో కాపునాడు అధ్యక్షులు నారాయణస్వామి రాయల్ నివాసంలో లో గ్రేటర్ రాయలసీమ జిల్లాలలో బలిజలు అందరూ ఐక్యం చేసి రాయలసీమ లో ఒక బలమైన శక్తి గా ఏర్పడాలని ,అందరూ కలిసి కార్తిక మాసంలో వనబోజన కార్యక్రమం సమష్టిగా విజయవంతము చేయాలని ప్రతి నియోజ వర్గం నుండి అందరూ ప్రతినిదులు గా బాధ్యత తీసుకొని గ్రేటర్ రాయల సీమ అని జిల్లాలు నుండి బలిజలు ఆహ్వానాలు అందేలా చూడాలని గ్రేటర్ రాయల సీమ నుండి రాయకీయ పార్టీ లలో అసెంబ్లీ ఎంపీ సీట్లు విషయం లో బలిజ కుల నిష్పత్తి ప్రకారం సీట్లు కేటాయించాలని ప్రభుత్వం తో పోరాటం చేయాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ నియోజక వర్గం నుండి శ్రీకృష్ణ దేవరాయ అన్నదాన సత్రం వ్యవస్థాపకులు బలిజ సంఘం నాయకులు విజయకుమార్,అహోబిలం అన్నాసత్రం ఉపాధ్యక్షులు సంజీవరాయుడు టివి 5 రిపోర్టర్ శివ రాయల్ కడప జిల్లా నుండి పసుపులేటి వీరభద్రుడు ,మస్తాన్ రాయల్ ,వెంకటసుబ్బయ్య , కదిరి నియోజక వర్గం నుండి నాగభూషణం ,రెడ్డప్ప రాయల్ తదితరులు పాల్గొన్నారు





సీమ వార్త సాయంకాలం

బుధవారం
5 ఆగస్టు 2026

# కర్ణాటక స్టేట్ భార్డర్ చెక్ పోస్ట్ ప్రారంభించిన సీఐ

క్రమ రవాణా, రోడ్ భద్రత, లిక్కర్ రవాణా తదితర వాటిపై నిగా ఏర్పాట్లు ఉంటాయి....
ఇరవై నాల్గు గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు....
ఇసుకపై ప్రత్యేక నిగా ఉంటుంది..సీ ఐ. రాగవన్....






**రొద్దం ఆగస్టు 05(సీమ వార్త సాయంకాలము)** మండలము లోని చెరుకూరు గ్రామములోని మూడు రోడ్లు కూడలి నందు బుధవారం కర్ణాటక భార్డ్ చెక్ పోస్ట్ ను పెనుకొండ సీ ఐ. రాగవన్ ప్రారంభించారు. రోడ్ కి అడ్డంగా బారిగేడ్లు ను, మరియు డ్రమ్ములు ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సత్య సాయి జిల్లా యస్ పీ యస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు స్టేట్ భార్డర్ చెక్ పోస్ట్ ప్రారంభించడం జరిగి అని ఆయన తెలిపారు. అందులో భాగంగా నే రోడ్ భద్రత లను పటిష్టంగా అరికాడతా మన్నారు. ఏ ఒక్కరు హెల్మెంట్ లేకుండా ప్రయానిం చరాదన్నారు. చిన్న పిల్లలకు బైకులు ఇస్తే వారి కుటుంబ యజమాని పై కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడుతూ బైక్ నడిపిన కేసు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ఏదేనా అక్రమ రవాణా జరిగితే అలాంటి వాటిపై కేసు నమోదు చేస్తామన్నారు. కర్ణాటక లిక్కర్ పై ప్రత్యేక నిగా పెంచుతామన్నారు. ఇక ముక్యంగా ఇసుక అక్రమ రవాణా పై ప్రతి రోడ్ కి ప్రత్యేక నిగా ఏర్పాటు చేస్తామన్నారు. పెన్నా నదిలోకి డ్రోన్లు తో నిగా ఏర్పాటు చేసి ఎవరైనా సరే వదిలే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి నుండి మొట్టమొదటి నిగా ఇసుక పైనే అన్నారు. వారు ఏ రోడ్ లో వెళ్లిన మా సిబ్బంది ధ్వారా అయినా పట్టుకొంటామన్నారు. అదేవిధంగా మండల తాసీల్దార్ ఉదయ్ శంకర్ రాజు చెరుకూరు లో ప్రారంభిం చిన చెక్ పోస్ట్ ను పరిసీలించారు. అలాగే చెక్ పోస్టులో వాహనాలను పోలీస్ లు పరిశీలిస్తున్న తీరును తాసీల్దార్ పరిశీలించారు.వాహనాలను అలాంటి వారి కేసు నమోదు చేస్థామన్నారు. ఈ కార్యక్రమం లో మండల యస్ ఐ. రాజ్ కుళ్లాయప్ప, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాం తంగా ని ర్వహించాలి







అదనపు ఎస్పి అంకిత సురాన
గణేష్ ఉత్సవాలు, అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పని చేయాలి...జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
అన్ని ఉత్సవ కమిటీలు బాధ్యతా యుతంగా వ్యవహరించాలి..
అడిషనల్ ఎస్పీ కె.వి. మహేష్

**హిందూపురం ఆగష్టు5సీమా వార్త :** రానున్న గణేష్ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వ హించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వ ర్యంలో హిందూ పురం పట్టణంలోని గుడ్డం కళ్యాణ మండపంలో బుధవారం సమ న్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీ సు శాఖ ప్రతి నిధులు, గణేష్ ఉత్సవ సమితుల సభ్యులు, నిర్వాహ కులు పాల్గొని ఉత్స వాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై విస్తృ తంగా చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా అదనపు ఎస్పీ అంకితా సురానా , హిందూపురం అదనపు ఎస్పీ కె.వి. మహేష్ మాట్లా డుతూ ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక బాధ్య తతో నిర్వహిం చాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఉత్సవ కమిటీ ప్రభుత్వం, పోలీసు శాఖ జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను తప్ప నిసరిగా పాటించా లని సూచించారు. ప్రజల సహకారం, శాఖల సమన్వయం తోనే ఉత్సవాలు విజయవంతమవుతాయని తెలిపారు.

**ఉత్సవ కమిటీలకు కీలక సూచనలు**

గణేష్ మండపాల ఏర్పాటుకు సంబం ధిత శాఖల నుంచి ముందస్తు అనుమ తులు తప్పనిసరిగా పొందాలి. విగ్రహ ప్రతిష్ఠాపన, నిమ జ్జన కార్యక్రమాలను నిర్ణీత సమయాల్లోనే నిర్వహించాలి. శబ్ద కాలుష్య నియం త్రణ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్ట మ్‌లు, అనుమతి లేని ఊరేగింపులు నిర్వహించరాదు. ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా మండ పాలు ఏర్పాటు చేయాలి. ప్రధాన రహదారులు, అత్య వసర మార్గాలను ఆక్రమించరాదు. విద్యుత్ కనెక్షన్లు భద్రతా ప్రమాణా లకు అనుగుణంగా ఏర్పాటు చేసి షార్ట్ సర్క్యూట్‌లు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అగ్నిప్రమాదాల నివారణకు అవసర మైన భద్రతా పరికరాలు సిద్ధంగా ఉంచాలి. ప్రతి మండపం వద్ద పారిశుధ్యం, పరి శుభ్రతకు ప్రాధాన్య త ఇవ్వాలి. మత సామరస్యానికి భంగం కలిగించే వ్యాఖ్యలు, నినా దాలు, కార్యక్రమా లకు దూరంగా ఉండాలి. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చ రించారు. ఊరేగింపుల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు,మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. నిమజ్జన కార్యక్రమాలను పోలీసు శాఖ సూచించిన మార్గా లు, సమయాలు, భద్రతా ప్రమాణా లకు అనుగుణంగా నిర్వహించాలి. అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీ సులకు సమాచారం అందించాలి. మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం, చట్ట విరుద్ధకార్యకలాపాలకు పాల్పడడం లేదా శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవ సమితుల ప్రతి నిధులు పోలీసు, రెవెన్యూ, మున్సి పల్, విద్యుత్, అగ్నిమాపక, వైద్య, రవాణా శాఖలతో నిరంతరం సమ న్వయం పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ ప్రజల సహకారంతో శ్రీ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వ హించేందుకు తగు జాగ్రత్తలు తీసు కోవడం జరుగుతుందన్నారుఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా అదనపు ఎస్పీ అంకితా సురానా, ఐపీఎస్, హిందూపురం అడిషనల్ ఎస్పీ కె.వి. మహేష్,జిల్లా రవాణా అధికారి కరుణసాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లి కార్జున, సీఐలు అబ్దుల్ కరీం, జనార్ధన్, రాజ గోపాల్ నాయుడు, ఆంజనేయులు, ఎస్ఐ రాజేష్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ సమితుల సభ్యులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇకపై ఎరువుల బుకింగ్‌కు బయోమెట్రిక్?!




-మొదటిపేజీ తరువాయి

దాని వినియోగంపై కూడా పరిశీలించారు. అందులో పలు లోపాల్ని గుర్తించి పంపించాయి. అలాగే దీనిపై కీలక సిఫార్సులు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్? బృందాలు 8 జిల్లాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఆ తనిఖీల్లో రూ. 1.34 కోట్ల విలువైన ఎరువుల్ని దారి మళ్లించినట్లు తేలింది. స్టాక్? రిజిస్టర్లతో పోల్చి చూడటంతో ఈ విషయం బయటపడింది.

తనిఖీల్లో వెలుగుచూసిన లోపాలు ఇవే! :

వరంగల్? ఎన్?ఫోర్స్?మెంట్? బృందాల తనిఖీల్లో 17.9 టన్నుల పొటాష్? దారి మళ్లినట్టు గుర్తించారు. మేడ్చల్? విజిలెన్స్? యూనిట్? తనిఖీల్లో 4.75 టన్నుల ఎరువులతోపాటు 71.8 లీటర్ల క్రిమిసంహార మందుల్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు బయటపడింది. దీంతో సంబంధిత డీలర్లపై రెండు 6ఎ కేసులతో పాటు క్రిమినల్? కేసు నమోదు చేశారు.

రామచంద్రాపురం యూనిట్ బృందాల పరిశీలనలో 14.53 టన్నుల యూరియా మాయమైనట్లు తేలింది. అలాగే హైదరాబాద్ సిటీ–2 యూనిట్ తనిఖీల్లో 2.25 టన్నుల నకిలీ డీఏపీని గుర్తించారు. సంబంధిత వ్యక్తులపై 3 కేసుల్ని నమోదు చేయించింది.

విజిలెన్స్ సిఫార్సులు ఇలా : ప్రస్తుతం యాప్?లో ఉన్న ప్రధాన లోపం కౌలు రైతులు ఎరువుల బుకింగ్ కోసం భూయజమాని సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీపైనే ఆధారపడుతున్నారు. దీని ద్వారా డీలర్లతోపాటు మరికొంతమంది అక్రమాలకు పాల్పడుతున్నారు. ఒకవేళ భూయజమాని అనుమతినిస్తే నిర్దిష్ట కాలానికి కౌలు రైతును అధీకృత ఎరువుల గ్రహీతగా నామినేట్ చేసే అవకాశాన్ని ఇవ్వొచ్చు. ఈ–పోస్ యంత్రం ద్వారా నామినీ తన గుర్తింపును ధ్రువీకరించుకొనేందుకు అనుమతించాలి.

ఎరువుల యాప్?కు అలాగే బయోమెట్రిక్ ప్రామాణీకరణ కోసం ఉపయోగించే ఈ–పోస్ యంత్రం మధ్య అనుసంధానం లేదు. దాంతో ఎరువుల యాప్?ను ఈ–పోస్? పరికరాన్ని రియల్‌టైం రీకన్సీలియేషన్‌తో ఒకే బ్యాకెండ్‌లో అనుసంధానించాలి. ఎరువుల బుకింగ్?, పంపిణీ రెండింటిలో లబ్ధిదారు బయోమెట్రిక్? తప్పనిసరి చేయాలి.

ప్రస్తుతం ఉన్న యాప్?తో పాటు ఐవీఆర్?ఎస్? విధానాన్ని తీసుకుని రావాలి. దయల్?–ఇన్?, వాయిస్?–గైడెడ్? మెనూ ద్వారా సులభంగా బుకింగ్?ను అనుమతించేలా ఈ ప్రక్రియను రూపొందించాలి. దీనివల్ల బుకింగ్? కోసం లబ్ధిదారు డీలర్లపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు.

## రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. “మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది. కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు” అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

## కీలక ప్రాజెక్టులకు పర్యావరణ క్లియరెన్స్ ఇవ్వాలి

-మొదటిపేజీ తరువాయి



పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణపై దృష్టి సారించింది. రాజీనామా బెదిరింపులకు వెనక్కి తగ్గకుండా కర్ణాటకలో ప్రయోగించిన ‘కఠిన వైఖరి’ ఫార్ములానే తెలంగాణలోనూ వర్తింపజేసి, మంత్రిపదవుల ఆశావహుల అసంతృప్తులకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. ఈ భేటీ తర్వాత తెలంగాణ కేబినెట్ విస్తరణపై ఏఐసీసీ నుంచి కీలక ప్రకటన వెలువడే అవకాశాలు ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

**భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? : సీఎం రేవంత్**

దిల్లీ: ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

## ఘనంగా రాజు జన్మదిన వేడుకలు



**హిందూపురం ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం.** హిందూపురం అక్షర విజయం: పట్టణంలోని బాపూజీ నగర్ 31వ వార్డుకి చెందిన తెలుగు దేశం పార్టీ యువ నాయకుడు బి.రాజు జన్మదిన వేడుకలు పలు ప్రదేశాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ డి రమేష్, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, జనసేన పార్టీ ఇంచార్జ్ ఆకుల ఉమేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజు మృదుస్వభావి, ప్రజాసేవ చేయాలి అని తపన ఉన్న వ్యక్తి ఆయనకు ఆయురారోగ్యాలతో పాటు, దేవుని యొక్క కృప కటాక్షం ఎల్లవేళలా మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ప్రవీణ్, అశోక్, యుగంధర్, భార్గవ్, అమీన్, జనసేన పార్టీ నాయకులు చక్రవర్తి, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ....నవతరానికి పునాది..!!

-మొదటిపేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ అభినందించారు. జిల్లా వ్యాప్తంగా టెన్త్ క్లాస్ పాస్ శాతం 80% కాగా, లేపాక్షి 100% ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జూడో క్రీడలో 24 మంది విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపిక కావడంపై ప్రత్యేక ప్రశంసలు తెలిపారు. విద్య అంటే కేవలం పుస్తకాల సమాచారాన్ని భట్టీ పట్టడం కాదు,ఆలోచించడం, విశ్లేషించడం, కొత్త ఆవిష్కరణలు చేయడమే అసలైన విద్య అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గురువులతో పాటు సమాజంలో సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరి పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత సమాజానికి తమ వంతు సేవ చేయడం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పట్టు గూడు నుంచి సీతాకోకచిలుక సహజంగా బయటకు వచ్చినట్లే, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను కష్టపడి జయించాలని, గెలుపుకు కుదరదారు లేవని స్పష్టం చేశారు. అనంతరం విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదవ మరియు పన్నెండవ తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు మరియు సత్కారం అందించారు.

**10వ తరగతి ప్రతిభావంతులు:**

కె. లాస్య రెడ్డి -- 98% (జిల్లా/పాఠశాల మొదటి ర్యాంకు)

కె. కిరణ్ తేజ -- 94.6% (రెండవ ర్యాంకు)ఎస్. అభిరామ్ -- 94.4% (మూడవ ర్యాంకు)

వై. స్నేహలత -- 94.4% (మూడవ ర్యాంకు) 12వ తరగతి ప్రతిభావంతులు:

ఎస్. చిత్రలేఖ -- 87.4% (మొదటి ర్యాంకు) పి. హేమలత -- 86.2% (రెండవ ర్యాంకు)ఎన్. కార్తీక్ సాయి -- 85.6% (మూడవ ర్యాంకు) ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు ఫౌండేషన్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

జెఎన్‌వి మదనపల్లె విద్యార్థులు ప్రత్యేకంగా ఇంటూషన్ ప్రోగ్రామ్ ప్రదర్శించి సభను అలరించారు.

జెఎన్‌వి లేపాక్షి విద్యార్థులు ప్రదర్శించిన రిథమిక్ యోగా డాన్స్ మరియు క్లాసికల్ డాన్స్ ప్రదర్శనలు సభలో విశేష ప్రశంసలు అందుకున్నాయి. ఈ వేడుకల్లో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు వేమనారాయణ, డాక్టర్ వెంకట రమణ, రాజా రెడ్డి, మరియు రమణా రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులకు తమ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ,పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు వద్దు..!!





**లేపాక్షి,ఆగస్టు 5: సీమ వార్త సాయంత్రం.** శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ బుధవారం లేపాక్షి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. వర్షపు నీటి యాజమాన్యం – ఇంకుడు గుంతకు భూమి పూజ... వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించి నిల్వ చేసేందుకు వీబీజీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా, లేపాక్షి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఇంకుడు గుంత నిర్మాణానికి జిల్లా కలెక్టర్ భూమి పూజ నిర్వహించారు. నీటి సంరక్షణలో భాగంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు.

**లేపాక్షి తహసీల్దార్‌కు జిల్లా కలెక్టర్ అభినందనలు...**

తహసీల్దార్ కార్యాలయ భవనం, ఆవరణ పరిశుభ్రత మరియు రికార్డు రూమ్‌లో రికార్డులను అత్యంత పద్ధతిగా, పర్ఫెక్ట్‌గా మెయింటెన్ చేయడం పట్ల లేపాక్షి తహసీల్దార్‌ను, రెవెన్యూ సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించి ప్రశంసించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు, రికార్డులను పక్కాగా భద్రపరచడంలో లేపాక్షి తహసీల్దార్ కార్యాలయం ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఇదే పనితీరును ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**తహసీల్దార్ కార్యాలయం – రికార్డుల తనిఖీ....**

అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, కార్యాలయ పనితీరుతో పాటు రికార్డు గదిని నిశితంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పద్ధతి, కార్యాలయ పరిశుభ్రత పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కు సంబంధించి దీూా – దీూా సమావేశాల రికార్డులను తనిఖీ చేశారు. అన్‌కలెక్టబుల్ ఓటర్లుగా వర్గీకరించిన మరణించిన వారు, ఇతరులు, వేరే చోట నమోదు చేసుకున్న వారు, శాశ్వతంగా వేరే ప్రాంతానికి మారిన వారు, మరియు ఆచూకీ లేని ఓటర్లకు సంబంధించిన ప్రతి ఫైలును ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో ‘నో మ్యాపింగ్’ మరియు ఇతర వ్యత్యాసాలకు సంబంధించి జారీ చేసిన నోటీసులను, పరిశీలన నివేదికలను కలెక్టర్ సవివరంగా తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి తహశీల్దార్ సౌజన్య లక్ష్మి,ఎంపిడిఓ,పంచాయతీ కార్యదర్శి సావిత్రి,డిప్యూటీ తహసీల్దార్,రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం
బుధవారం
5 ఆగస్టు 2026

# 'ఐక్యూ, ఈక్యూ - విశ్వశక్తులు' పై అవగాహన.

కోడిగినహళ్లి ఏపీ ఆర్ స్కూల్ ఆఫ్
ఎక్సలెన్స్ పై విద్యార్థులకు సూచనలు.
రాజయోగి భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమాలు.





**హిందూపురం ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం.** విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడంలో కోడిగినహళ్లి ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ ఎల్లప్పుడూ ముందుంటుందని, విద్యార్థులు తమ జీవితంలో అద్భుతాలు సాధించాలంటే విశ్వ రహస్యాలు, అంతర్గత శక్తులపై అవగాహన కలిగి ఉండాలని పర్యావరణవేత్త, ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ వాలంటరీ కోఆర్డినేటర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు.?కోడిగినహళ్లి ఏపీ ఆర్ ఎస్ ఓ ఈ ప్రిన్సిపల్ నరేంద్ర నాయకత్వంలో పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల మార్గదర్శకత్వం కోసం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భాస్కర్ నాయుడు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐక్యూ మరియు ఈక్యూల ప్రాముఖ్యత: కేవలం మేధోశక్తి మాత్రమే కాకుండా, భావోద్వేగ సమతుల్యత కూడా విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.?విశ్వశక్తుల రహస్యం: ప్రతి ఒక్కరిలో అపారమైన శక్తి దాగి ఉంటుందని, సకారాత్మక ఆలోచనలు ఏకాగ్రత ద్వారా విశ్వశక్తులను ఆవాహన చేసుకుని అత్యుత్తమ ఫలితాలు ఎలా సాధించవచ్చో విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.?ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ మాట్లాడుతూ, విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి, మానసిక దృఢత్వానికి ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.?ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ సభ్యులు ఈశ్వర్ రెడ్డి కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థి చల్లా అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## గోరంట్ల జనం కోసం...
## దూకుడు పెంచుతున్న సవితమ్మ టీం.

పార్నపల్లి డ్యాం నీళ్లు గోరంట్ల కొస్తే... నీటి కొరత తీరినట్లే.
కార్యచరణకు శ్రీకారం చుటుతూ అధికారులు, లీడర్స్ బృందం సర్వే.





**గోరంట్ల ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల పట్టణం నూతన పైప్ లైన్ ఏర్పాటు కు ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు, కూటమి నాయకులు, సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యుల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం గోరంట్ల పట్టణంలో కొంత కాలంగా ఏర్పడిన త్రాగునీటి ఎద్దడి నెలకొనడంతో సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు,దీంతో మంత్రి సవితమ్మ వెంటనే స్పందించి, పార్నపల్లి రిజర్వాయర్ ద్వారా కొత్తచెరువు నుండి గోరంట్ల ఎంపిడిఓ కార్యాలయం వద్ద నుండి ఏం ఆర్ సీ కార్యాలయం వద్ద గల నీటి ట్యాంక్ కు నూతన పైప్ లైన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేయడం తో టెక్నికల్ గా పరిశీలనకు ఆర్ డబ్ల్యూ ఎస్ డి ఈ శ్రీనివాసులు, ఏ ఈ మోహన్ లు ఈ ఓ గురు స్వామి, సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు నాగే నాయక్, గిరిధర్ గౌడ్, షేక్ అజ్మతుల్లా, నిమ్మల శ్రీధర్, జయరామ్,మండల బీజేపీ అధ్యక్షుడు బోయ లక్ష్మీనారాయణ, బొట్టు శ్రీనివాసులు,హరీష్, జనసేన సంతోష్, సురేష్,వెంకటేష్, రమేష్ తో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదులు విధులు బహిష్కరణ మడకశిర



**ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం** హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో బహుజన చైతన్య వేదిక వ్యవస్థాప అధ్యక్షులు , దళిత న్యాయవాది శివరామకృష్ణ ని హిందూపురం వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు నానా దుర్భాషలాడుతూ అతనిపై బూటు కాలుతో తన్ని అతనిపై దాడి చేయడానికి తీవ్రంగా మడకశిర న్యాయవాదుల సంఘం ఖండిస్తూ బుధవారం తమ విధులను బహిష్కరించారు, న్యాయవాదిపై దాడి చేయడం చాలా హేయమైన చర్య సిఐ రాజగోపాల్ నాయుడు ని తన విధుల నుండి తప్పించి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా దళిత న్యాయవాది పై దాడి చేసి బూటు కాలితో తన్నిన సిఐ రాజు గోపాలనాయుడు పై ఎస్సీ ఎస్టీ కేసును నమోదు చేయాలని మడకశిర న్యాయవాదులు డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో మడకశిర న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అశ్వత్ నారాయణ, సీనియర్ న్యాయవాదులు జి గోవిందరాజులు, సీకే నాగేగౌడ్, హెచ్ ఎస్ నారాయణ గౌడ్, సిఎం శ్రీనివాసులు, జె కరియన్న, పీఈ లోకేష్, రవి, నరసింహమూర్తి , దివాకర, రంగనాథ్,నటరాజ్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## రైతు పొలాల్లో శాస్త్రవేత్తల సందర్శన మడకశిర



**ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం** వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన సాగు యాజమాన్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటలను సంరక్షించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. బుధవారం మడకశిర మండలంలోని పలు గ్రామాల్లో రైతు పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తల బృందం పంటల పరిస్థితిని పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, అనంతపురం నుండి వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. భాస్కర్ రావు, డా. నటరాజ్, డా. లక్ష్మణ్, డా. సెల్టన్ పీటర్ పాల్గొని రైతులకు శాస్త్రీయ సలహాలు అందించారు. పంటల ప్రస్తుత పరిస్థితి, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమగ్ర పోషక నిర్వహణ యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు.వేరుశనగ మరియు కంది పంటలలో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు ఎకరానికి 1 కిలో పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల మొక్కలకు అవసరమైన పోషకాలు అందడంతో పాటు ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని శాస్త్రవేత్తలు సూచించారు. అదేవిధంగా కంది రెడ్ గ్రామ్ పంటలో తల్లి సాలు తీయడం ద్వారా వర్షం కురుసినప్పుడు నీరు నిలబడి నేలలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండి పంట ఎదుగుదలకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సెప్టెంబర్ నెల వరకు అమలు చేయాల్సిన ప్రత్యామ్నాయ పంటల ను, వర్షపాతం ఆధారంగా చేపట్టాల్సిన వ్యవసాయ నిర్వహణ చర్యలు, అంతర దుక్కులు, కలుపు నివారణ, తేమ సంరక్షణ చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. అలాగే నీటి పొదుపు పద్ధతులు, వాతావరణానికి అనుగుణంగా పంటల నిర్వహణ, సమయానుకూలంగా వ్యవసాయ పనులు చేపట్టడం ద్వారా దిగుబడులను పెంచుకోవచ్చని రైతులకు వివరించారు. రైతులు అడిగిన పలు సందేహాలకు శాస్త్రవేత్తలు సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప, వ్యవసాయ విస్తరణ అధికారి బి. కౌసర్ పాల్గొని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సాంకేతిక సేవలు, ప్రభుత్వ పథకాలు మరియు దిగుబడి ఆదారిత పంటల భీమా పై వివరించారు.

## బిడ్డ పుట్టిన.... గంటలోపే తల్లి పాలు తాగించాలి.

బూదిలి లో తల్లిపాల వారోత్సవాలు.... సూపర్వైజర్ మంజుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు.



**గోరంట్ల ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం.**గోరంట్ల మండలం లోని బుదిలీ సచివాలయం లో ఐసిడిఎస్ సూపెర్వైసర్ మంజుల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం,అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించడం జరిగింది..తల్లి పాలు బిడ్డకు ప్రకృతి ప్రసాదించిన వరం అని, తల్లి పాలే బిడ్డకు మొదటి టీకా అని, పుట్టిన గంట లోపే బిడ్డకు తల్లి పాలను తాపాలని ,6 నెలలు కేవలం తల్లి పాల ను మాత్రమే బిడ్డకు తాపాలని ఆరు నెలల తరువాత తల్లి పాలతో పాటు అనుబంధ పోషక ఆహారం అయినా బాగా ఉడికించిన ఆకుకూరలు, కూరగాయలు,అన్నం తో పాటు అంగన్వాడి లో ఇచ్చే బాలమృతం పూటకు 30గ్రాం లెక్కన రోజుకు 100 గ్రాము లు తినిపించాలి .అని కనీసం 2 సంవత్సరాల పాటు పాలను తాపాలని తెలియచేయటం జరిగింది. బిడ్డకు మొదటి 2 సంవత్సరాల వయస్సు కీలక మైనది అని తెలియ జేయుట జరిగింది..తల్లి పాలు బిడ్డకు శారీరక మానసిక అభివృద్ధి కి ఎంత గానో దోహద పడుతాయని,,బిడ్డను అనేక వ్యాధుల బారిన పడకుండా రక్షణ కల్పిస్తాయని తెలియజేయుట జరిగింది. బిడ్డకు పాలను తాపటం వలన రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా వుంటుంది..తల్లికి కూడా తగినంత విశ్రాంతి, మంచి పౌష్టికాహారశీ తీసుకునే విధంగా కుటుంబ సభ్యులు సహకారం అందించాలని తెలియచేయటం జరిగింది..ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.ఓ ప్రశాంతి, ఏఎన్ఎం పార్వతి, గర్భవతులు ,బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు, అంగన్వాడీ కార్యకర్త లు,ఆశా కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## చలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరించిన సిపిఐ నాయకులు



మోడీ ప్రభుత్వ విధానాలపై నిరసనకు పిలుపు

**తాడిపత్రి, ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం:** బుధవారం తాడిపత్రి నియోజకవర్గ సిపిఐ పార్టీ కార్యాలయం ముందు సెప్టెంబర్ 1న జరగనున్న "చలో ఢిల్లీ" కార్యక్రమ పోస్టర్లను తాడిపత్రి సిపిఐ నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి. రంగయ్య మాట్లాడుతూ నేడు భారతదేశం ఒక కీలక మలుపులో ఉందని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గత దశాబ్ద కాలంలో ఆందోళనలకు, నిరాశ,నీరసనాలకు దారి తీసిందని విమర్శించారు.ఎన్నికల సందర్భంగా బీజేపీ అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తామని వాగ్దానం చేసిందని, కానీ దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం, భరించలేని ధరల పెరుగుదల, విస్తరిస్తున్న అసమానతలు, బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, కుంచించుకుపోతున్న ప్రజాస్వామ్యం, పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తతలు ఎదురవుతున్నాయని ఆరోపించారు.మోడీ ప్రభుత్వం ప్రజా సమస్యలకు సమాధానం చెప్పకుండా చర్చను ఇతర అంశాల వైపు మళ్లిస్తోందని, సామాన్య పౌరుల రోజువారీ సమస్యలను పరిష్కరించకుండా బీజేపీ , ఆర్ యస్ యస్ మతపరమైన ధ్రువీకరణ, విభజన రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ద్వేషాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.ఈ సందర్భంగా కొని ప్రధాన డిమాండ్లు ఈవిధంగా ఉన్నాయి. ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలిసార్వత్రిక విద్య, ఆరోగ్యం అందుబాటులోకి తేవాలి పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు పునరుద్ధరించాలి ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలిమహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలి కార్మిక హక్కులను పరిరక్షించాలిదళిత,ఆదివాసులపై దాడులను నిలిపివేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, సిపిఐ మండల కార్యదర్శి నాగరంగయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సి. రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్త జైల్ భరో - అఖిల భారత రైతు సమాఖ్య పిలుపు




తాడిపత్రిలో రాష్ట్ర కమిటీ సమావేశం

**తాడిపత్రి,ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం:** అఖిల భారత రైతు సమాఖ్య – ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం తాడిపత్రి పట్టణంలోని కాంచాని లాడ్జిలో జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమిరెడ్డి జగదీశ్వరెడ్డి ఆధ్వర్యంలో సంఘం నిర్మాణ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, రైతు ఉద్యమాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తూ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రుణమాఫీ, ఉచిత విద్యుత్, పంటలకు పూర్తి బీమా వంటి డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఆగస్టు 10న రాష్ట్రంలోని అన్ని జిల్లా, పట్టణ కేంద్రాల్లో ఇతర రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి "జైల్ భరో" కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది.

# ఘనంగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జన్మదిన వేడుకలు





బైక్ ర్యాలీ నిర్వహణ -- ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ -- కేక్ కట్ చేసి సంబరాలు

**కళ్యాణదుర్గం, ఆగస్టు 5 (సీమవార్త సాయంకాలం):** కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రజావేదిక వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే చిత్రపటానికి పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, యువత, అభిమానులు పాల్గొని ఉత్సాహంగా నినాదాలు చేశారు. తదుపరి ఆర్డీటీ ఆసుపత్రి మరియు ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించిన నాయకులు అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రైతు సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. కృష్ణా జలాలను కళ్యాణదుర్గం ప్రాంతానికి తీసుకురావాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్నారని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందదాయకమని, ఎమ్మెల్యే మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పసుపు రంగు పాలు... బిడ్డకు రోగ నిరోధక శక్తినిస్తుంది.






ఖాజాపురం , మండలపల్లి గ్రామాలలో తల్లి పాల వారోత్సవాలు.
ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు.

**గోరంట్ల ఆగస్టు 5 సీమ వార్త సాయంత్రం.** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గోరంట్ల మండలం లోని మందలపల్లి పంచాయతీ పరిధిలోని ఖజాపురం మరియు మందలపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరాణి గర్భిణులు, బాలింతలు మరియు కుటుంబ సభ్యులను ఉద్దేశించి మాటాడుతూ, శిశువు జన్మించిన మొదటి గంటలోపు తల్లి పాలు పట్టించడం ఎంతో అవసరమని తెలిపారు. పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు పాలు (కొలస్ట్రం) శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందించే తొలి టీకా వంటివని వివరించారు.జననం నుండి మొదటి ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు, తేనె లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. ఆరు నెలల తర్వాత ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారాన్ని ప్రారంభించి, రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలను కొనసాగించాలని తెలిపారు.తల్లి పాల వల్ల శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, డయేరియా, న్యుమోనియా వంటి వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందని చెప్పారు. అలాగే తల్లి పాలివ్వడం వల్ల తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.

ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ గ్రామాల లో ర్యాలీ నిర్వహించారు. బాలింతల సందేహాలను నివృత్తి చేసి, ప్రతి తల్లి తన బిడ్డకు తల్లి పాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సౌమ్య,చంద్రకళ ఏఎన్ఎంలు ప్రమీల,పరిమళ ,మహిళా సంరక్షణ అధికారీ ప్రియాంక ,గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఈనెల 6న వీరభద్ర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



**లేపాక్షి ఆగస్టు 5 సీమ వార్త సాయంకాలం:** లేపాక్షి మండల కేంద్రంలో వెలసిన శ్రీ వీరభద్ర స్వామి వారి ఉండిని ఈనెల ఆరవ తేదీ ఉదయం 10: 30 నిమిషాలకు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గ్రామ పెద్దల సమక్షంలో చేపడుతున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం.హెచ్ నరసింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు హాజరుకావాలని ఆలయ ఈ ఓ కోరారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881